క్లుప్తంగా

అప్పన్న గోసంరక్షణ పథకానికి రూ.2 లక్షల విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గోసంరక్షణ పథకానికి నగరంలోని మధురానగర్‌కు చెందిన ఎం.ఎస్.వి.ఎస్.బి.ఎల్. చంద్రిక అనే దాత శనివారం రూ. రెండు లక్షలు అందజేశారు. కొండదిగువ పరిపాలనా కార్యాలయంలో నగదు రూపంలో ఏఈవో రమణమూర్తికి ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు బాండ్ అందజేశారు. దేవస్థానం ఏఈ హరి, గోశాల సీనియర్ అసిస్టెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

అలరించిన హాస్యవల్లరి


స్కిట్ ప్రదర్శిస్తున్న కోరుకొండ రంగారావు బృందం

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం రాత్రి కోరుకొండ రంగారావు బృందం ప్రదర్శించిన హాస్యవల్లరి ప్రేక్షకులను అలరించింది. టీవీ-101, నాలుగు వారాల షాపింగ్ ప్రేమ్, ఉద్యోగం పోయింది, జనాభా లెక్కలు, సిట్యుయేషన్ సాంగ్ వంటి స్కిట్లు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ఈ సందర్భంగా వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యులు హాస్యనటులను సత్కరించారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు హాస్యనాటికలను తిలకించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాలు


దాబాగార్డెన్స్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి

అల్లిపురం: మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలకు పైగా జరిమానా తప్పదని టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు. శనివారం ఒక్కరోజే టూటౌన్ పరిధిలో 36 మంది నుంచి కోర్టు రూ.4 లక్షల 10 వేలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెన్ స్కూల్, అంబేడ్కర్ జంక్షన్, అల్లిపురం జంక్షన్‌లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారిని శనివారం నగరంలో స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లక్ష్మి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే న్యాయస్థానాల్లో భారీ జరిమానా తప్పదని, అదే విధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.

24వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు శనివారం 24వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అవినీతిపరుడికి జైలే గతి!

- టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుపై నియోజకవర్గ ప్రజల స్పందన

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ అధికారులు శనివారం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడును అదుపులోకి తీసుకున్న సంఘటనను ఉత్తర నియోజకవర్గ ప్రజలు సమర్థిస్తున్నారు. తప్పు చేసిన వారు ఎంత హోదాలో ఉన్నా సరే.. శిక్ష నుంచి తప్పించుకోలేరని అంటున్నారు. తన 40 ఏళ్ల రాజకీయ అనుభవంలో చంద్రబాబు ప్రజల కోసం చేసిన మంచి కన్నా.. అవినీతే ఎక్కువగా కనిపిస్తోందన్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టే వారు, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే వారికి ఇది గుణపాఠం కావాలంటున్నారు. ప్రజలకు సేవకులుగా ఉండాల్సిన నేతలు వారి సొమ్మునే దుర్వినియోగం చేస్తే చట్టాలు తమ పని తాము చేసుకుంటూ పోతాయంటున్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను రాజకీయం చేయవద్దని ప్రజలు కోరుతున్నారు. ఆయనను కాపాడాలని చూసే వారు కూడా ప్రజలకు ద్రోహం చేసేవారు అవుతారని చెబుతున్నారు. దీనిని రాద్ధాంతం చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించడం తగదన్నారు. – సీతంపేట/సీతమ్మధార/తాటిచెట్లపాలెం/మద్దిపాలెం

ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు



ప్రతిపక్ష నేత చంద్రబాబు అవినీతి బట్టబయలైంది. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో ఎంతో నైపుణ్యంగా స్కాంకు పాల్పడినప్పటికీ చివరికి చట్టానికి దొరక్క తప్పలేదు. ప్రజాధనాన్ని దోచేయడం చాలా దారుణం. స్కాం కేసులో అరెస్టు చేస్తారని చంద్రబాబుకు ముందే తెలుసు. సీఐడీ అన్ని ఆధారాలతో అరెస్టు చేసింది. ఇందులో ఎవరి ప్రమేయం లేదు. – సంపంగి శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు

చట్టం ముందు అందరూ సమానులే



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు న్యాయపరమైనది. నిజాయితీపరుడిని అని చెప్పుకునే వ్యక్తిని మూడేళ్లుగా సీఐడీ, ఈడీ, జీఎస్‌టీ, విజిలెన్స్ సంస్థలు దర్యాప్తు చేసి తగిన ఆధారాలతో అరెస్టు చేశారు. తప్పుచేసిన వారు ఎవరైనా న్యాయం ముందు తలవంచాల్సిందే. దీనిని ప్రతిపక్షాలు తప్పుపట్టడం సరికాదు. చట్టం ముందు అందరూ సమానులే. – ఎం.రవికుమార్, రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్

అడ్డంగా దొరికిపోయారు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికిపోయారు. ఆయన తప్పు చేశారు కాబట్టే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రజా ధనం రూ.371 కోట్లు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. – పిల్లి చంద్రమౌళిరెడ్డి, నక్కవానిపాలెం

చంద్రబాబుకు శిక్ష తప్పదు



ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజా ధనాన్ని దోచుకోవడం దారుణం. తాను నిజాయితీగా ఉంటానని పదేపదే చెప్పుకునే చంద్రబాబును అరెస్ట్ చేయడం సరైనది. దోచుకోవడం, దాచుకోవడమే ఆయన నైజం. చేసిన తప్పునకు శిక్ష అనుభవించాల్సిందే. – నీలాపు కృష్ణ కామేశ్వరరావు, రేసపువానిపాలెం

బాబును ఎప్పుడో అరెస్ట్ చేయాలి



టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని ఎప్పుడో అరెస్ట్ చేయాలి. బాగా ఆలస్యం చేశారు. ఆయన చేసిన మోసాలు, మాయలు చాలా పెద్దవే ఉన్నాయి. వాటితో పోలిస్తే స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం చాలా చిన్నది. ఇకపై చంద్రబాబు చేసిన మోసాలను ఒక దాని తర్వాత ఒకటి బయటపెడుతూ జైల్లోనే మగ్గి పోయేలా, బయటకు రాకుండా చేయాలి.ఆయన కొడుకు లోకేశ్‌ను కూడా వదలకూడదు. – సనపల వరదరాజులు, మురళీనగర్, 50వ వార్డు

టీడీపీ అధినేత అరెస్ట్ సరైనదే



మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబును ఎప్పుడో అరెస్టు చేయాలి. ఇప్పటికే ఆలస్యమైంది. ఆయన అనేక కుంభకోణాల్లో సూత్రధారి, చంద్రబాబు అరెస్టు ఏ మాత్రం తప్పు కాదు. చంద్రబాబు పదవీ కాలంలో ఆయనతోపాటు బృందం అనేక స్కాంలు చేసి అవకతవకలకు పాల్పడి ప్రజాధనాన్ని దోచుకున్నారు. రూ.371 కోట్ల అవినీతి స్కాంలో సీఐడీ పోలీసులు ఆధారాలతో ఆయనను అరెస్ట్ చేశారు. తప్పు చేసిన వారెవరైనా ఏదో ఒక రోజు శిక్ష అనుభవించక తప్పదు. – పులపా రవీంద్రనాథ్ ఠాగూర్, అధ్యక్షుడు, విశాఖ అర్బన్ కాపు సంక్షేమ సంఘం

తప్పు చేశాక.. శిక్ష పడాల్సిందే



తన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చూపించి టీడీపీ అధినేత చంద్రబాబు రూ.371 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. తప్పు చేశాక ఎంతటివారైనా ఏదో ఒక రోజు చట్టానికి దొరకాల్సిందే అని చెప్పడానికి ఆయన ఘటనే ఉదాహరణ. చంద్రబాబు అరెస్టు వెనుక ఎటువంటి కుట్ర, ఎవరి హస్తం లేదు. అన్ని ఆధారాలతో అరెస్టు చేస్తే టీడీపీ నాయకులు, జనసేనాని పవన్ కల్యాణ్ గగ్గోలు పెడుతున్నారు. అవినీతికి పాల్పడినట్లు రుజువులున్నాయి కాబట్టే పోలీసులు అరెస్టు చేశారు. – జోరీగల గణేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు, సీతంపేట

టీడీపీ నేతల ముందస్తు అరెస్ట్

సీతమ్మధార/మద్రిపాలెం: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో సీఐడీ అధికారులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా ఉండేందుకు ముందుగా ఆ పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోర్ట్‌టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని అక్కయ్యపాలెం, సీతంపేట, గాంధీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన నాయకులను 151 సెక్షన్ కింద అరెస్ట్ చేసి సొంత బెయిల్‌పై విడిచిపెట్టారు. కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 12 మంది టీడీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. అందులో ఒక మహిళా నాయకురాలు ఈతలపాక సుజాతను మాత్రం హౌస్ అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. పెంటకోట అజయ్‌బాబు, 56వ వార్డు కార్పొరేటర్ సరగడం రాజశేఖర్, సనపల వరప్రసాద్, కె.పైడికొండ, మధుబాబు, కొరిబిల్లి రాజేశ్వరరావు, వేగి శేషగిరిరావు, పిల్లి బేబి, మొర్తా గణేశ్వరరావు, మొర్తా రాజారావు, ధనాల అప్పారావులను రాత్రి సెల్ఫ్ బెయిల్‌పై విడుదల చేశామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని వారు స్పష్టం చేశారు.

చంద్రబాబు అరెస్టును ప్రజలు స్వాగతిస్తున్నారు..

జగదాంబ: చంద్రబాబు అరెస్టును ప్రజలు స్వాగతిస్తున్నారని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. శనివారం వార్డు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


55వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ శశికళ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు జోగారావు నగర్, గంగన్ననగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.58.75 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జోన్-5 డీఈ భరణికుమార్ తెలిపారు. తిక్కవానిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి, గాంధీనగర్, జోగారావునగర్, జాషువానగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు కె.కె.రాజు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలోనే ప్రతి ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ, రత్నాకర్, డి.శ్రీనివాసరావు, గంగామహేష్, అమర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు, గౌష్, సంతోష్, లక్ష్మి, మధు, ధర్మేందర్ రెడ్డి, దివాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివప్రసాద్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా రేపు

కంచరపాలెం: ఈ నెల 11న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2023 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ నరవలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ మేళా జరుగుతుందని తెలిపారు. ఐటీఐల్లో వివిధ కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ పూర్తి చేయని వారు, ఆర్ అండ్ ఏసీ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ ట్రేడులు పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ షిప్ మేళాకు అర్హులన్నారు. 15 జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం నరవ ఐటీఐలో ఉదయం 10 గంటలకు నేరుగా బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 93987 85720 నంబర్‌లో సంప్రదించాలని విజయలక్ష్మి సూచించారు.

విద్యార్థుల ప్రతిభకు పట్టం


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న మురళీనగర్-మాధవధార వెలమ సంఘం నాయకులు

మురళీనగర్: ప్రతిభావంతులైన వెలమ కుటుంబాల్లోని విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభకు పట్టం కడదామంటూ మురళీనగర్-మాధవధార వెలమ సంక్షేమ సంఘం నాయకులు, పెద్దలు తీర్మానించారు. మురళీనగర్‌లోని ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో సంఘం ఆధ్వర్యంలో శనివారం వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. సంఘం అధ్యక్షుడు పాశల సూర్యనారాయణ, కార్యదర్శి వెన్నెల సూర్యనారాయణల అధ్యక్షతన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వెలమ చిన్నారులను, ప్రజ్ఞావంతులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థుల నుంచి 2023లో పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారిని ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 30 మందికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాలను అతిథులు చేతుల మీదుగా అందించారు. ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన పాడిపిరెడ్డి వివేకవర్ధన్, డీఎస్పీ బొడ్డు హేమంత్, డిప్యూటీ కలెక్టర్ మడక కృష్ణలను సంఘ సభ్యులతో పాటు అతిథులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో విశాఖ-కాకినాడ పెట్రో కెమికల్ కారిడార్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, యలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, చోడవరం నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి, సెంట్రల్ ఆర్గనైజేషన్ కార్యదర్శి బండారు రామకృష్ణ, సెంట్రల్ ఆర్గనైజేషన్ మాజీ అధ్యక్షుడు చలుమూరి అప్పల సత్యనారాయణ, సంఘ గౌరవాధ్యక్షుడు బోకం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు లాలం జానకీరాం, కోశాధికారి పాటురెడ్డి సన్యాసిరావు, రొంగలి లక్ష్మి, పూర్వ గైస్ ప్రిన్సిపాల్ బోకం దేముడు, కార్యవర్గ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం డిపోకు రూ.5 లక్షల నష్టం

మద్దిలపాలెం: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు చేయడంతో ఆందోళనకారులు ఎక్కడ బస్సులపై దాడులకు పాల్పడతారోనని ముందస్తుగా చాలా సర్వీసులు నిలిపివేశారు. మద్దిలపాలెం డిపోలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ బస్సులు ఎక్కడి అక్కడే నిలిచి పోయాయి. మధ్యాహ్నం తర్వాత నుంచి నగరంలో పలు ప్రాంతాలకు కొన్ని సర్వీసులు నడిపారు. కాగా సిటీ బస్సులను సుమారు 40 బస్సులు రద్దు చేశారు. దీంతో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా సుదీర ప్రాంతాలైన కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం వంటి ప్రాంతాలకు నడిపే ఏసీ బస్సులు 10 సర్వీసులను పూర్తి రద్దు చేశారు. దీంతో మరో రూ.2 లక్షల వరకూ నష్టం ఏర్పడిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వినోద్ బాలుకు 'సురా' పురస్కారం


అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సోషల్ వర్కర్ వినోద్ బాలు

సీతంపేట: హేతువాది పేరిచర్ల సుబ్బరాజు(సురా) సామాజిక సేవా పురస్కారం 2023 సంవత్సరానికి సోషల్ వర్కర్ ఉడుముల వినోద్ బాలుకు ప్రదానం చేశారు. సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అధ్యక్షతన శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా పురస్కారం, రూ.25 వేల నగదును ఆయనకు అందించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ రక్తదాన ఉద్యమకారుడు, 937 రక్తదాన శిబిరాలు నిర్వహించి, 52 వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించి వేలాది మంది ప్రాణాలు నిలిపిన వినోద్ బాలుకు సురా పురస్కారం ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. బాలు చేస్తున్న కృషికి ఇప్పటికే యూత్ సర్వీసెస్ అవార్డు, ఛత్రపతి అవార్డు, ఆపద్బాంధవుడు, యంగ్ డైనమిక్ పర్సన్, భారత రక్త బంధు పురస్కారం వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ ట్రస్టీ కె.బాబూరావు, రచయితలు అనిసెట్టి రజిత, కె.ఎస్.మల్లీశ్వరి, రిటైర్డ్ ప్రొఫెసర్ పేటా బాబివర్ధన్, సరిగమ సంగీత సంస్థ ఫౌండర్ ఎస్.కోటేశ్వరరావు, ట్రస్టు ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో అవినీతి నిర్మూలన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు, ఉద్యోగులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డీఆర్‌ఎం కార్యాలయంలో శనివారం అవినీతి నిర్మూలన, నిఘా ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎదుర్కొన్న అవరోధాలు, పొరపాట్లను సరిచేసుకునేలా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడం వల్ల తదుపరి విధుల్లో పొరపాట్లకు ఆస్కారం ఉండదన్నారు. డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.పి.సిన్హా మాట్లాడుతూ ఉద్యోగులందరూ అవినీతి నిర్మూలనలో ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవినీతి, లంచాలకు తావులేని విధంగా నిష్పక్షపాతంగా సేవలందించేందుకు ఇటువంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. రైల్వేలో టెండర్లు, ఆక్షన్లు, కాంట్రాక్టులు, పలు కార్యక్రమాల్లో క్రమశిక్షణ, నిజాయితీలతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగుల నుంచి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్-2 పి.జె.శర్మ, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.అవినాష్ శర్మ, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ సౌరభ్ ప్రకాష్, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్(పర్సనల్) ఎ.రామారావు, ట్రాఫిక్, కమర్షియల్, పర్సనల్ బ్రాంచ్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందమానందమాయె..!


విశ్రాంత గురువులను సత్కరిస్తున్న కేంద్రీయ విద్యాలయ వాల్తేర్ పూర్వ విద్యార్థులు

సందడిగా.. సంతోషంగా కేవీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారి పక్కనున్న తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో శనివారం పూర్వ విద్యార్థుల 3వ సమ్మేళనం మిలాన్-2023 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేవీ వాల్తేర్, మిలన్-2023 కన్వీనర్ కల్నల్ విజయ్ బలరామ్ మాట్లాడుతూ 1986 నుంచి 2023 వరకు ఈ స్కూల్‌లో విద్యనభ్యసించిన అనేక మంది పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులంతా దేశ విదేశాల్లో ఉన్నత హోదాలు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఎందరో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి, విజయవంతమైన వ్యక్తులుగా తయారుచేసి, మార్గనిర్దేశం చేసిన గురువులకు తామంతా రుణపడి ఉంటామని తెలుపుతూ.. కృతజ్ఞతగా వారందరినీ సత్కరించామన్నారు.

10 మంది పేద విద్యార్థులకు సాయం

ప్రస్తుత విద్యార్థుల్లో 10 మంది పేద పిల్లలు ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నారని తెలుపగా.. అలుమ్ని సభ్యులు వీరి కోసం రూ.48 వేల చెక్కును ప్రిన్సిపాల్ కమల్‌జీత్‌కు అందజేశారు. ఈ పాఠశాల విద్యార్థులకు భవిష్యత్తులో ఏ రకమైన ఆటంకాలున్నా.. వారిని దత్తత తీసుకుని తామే చదివించేందుకు కోర్ కమిటీ తీర్మానించిందని విజయ్ బలరాం తెలిపారు. ఈ సందర్భంగా మిలాన్-2023 కమిటీ సభ్యులు 50 మంది విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సభ్యులు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ సందడిగా.. సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో సి.వి.రఘు, ఎన్.వి.సురూప, రాజకుమారి, విజయ్‌భాస్కర్, డి.భాస్కర్, అనిత, రవికిరణ్, హంజీ, వాసు, మూర్తి, ఉదయ్, పలువురు దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్‌కు చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు


సంపత్ వెంకన్న ఆలయంలో సత్యనారాయణకు ముఖద్వార డోర్ కర్టెన్లు అందిస్తున్న భక్తులు


కలియుగ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ దశమి సందర్భంగా శనివారం స్థానిక వేంకటేశ్వరుడి ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్యామాచార్యులు నేతృత్వంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. వేంకటేశ్వరుడి గర్భగుడికి శంకుచక్రాలు ముద్రించిన డోర్ కర్టెన్లను ఓ భక్తుడు శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణకు అందజేశారు. పల్లా వెంకటరావు, పల్లా పెంటారావు, కొయ్య జగదీష్, నమ్మి భాస్కర్ తదితర సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం ఆకాశ దీపారాధన, విశేష హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దంత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ భవ్యశ్రీ

సీతమ్మధార: జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) విశాఖ ప్రైడ్ ఆధ్వర్యంలో శనివారం సీతమ్మధారలోని విశాఖ జీవన్ గృహ సముదాయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జేసీఐ విశాఖ ప్రైడ్ ప్రెసిడెంట్ కె.లక్ష్మీసురేఖ మాట్లాడుతూ జేసీఐ వీక్ జైత్ర కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వీ డెంటల్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ ఎస్.భవ్యశ్రీ స్థానికులకు దంత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవన్ గృహ సముదాయం కమిటీ కార్యదర్శి పి.శ్రీనివాస్, సెక్రటరీ చందు, కోశాధికారి కె.శ్రీను, డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.